సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ వివరాలు అందజేస్తున్న కమిటీ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వరకాలనీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒక్క ప్యానల్ మాత్రమే రావడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా ఎ.వీర్రాజు, కార్యదర్శిగా జి.పార్వతీశ్వరరావు, కోశాధికారిగా ఎ.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా మురళి, శ్రీనివాసరావు, మోహనరావు, సంయుక్త కార్యదర్శులుగా కోటేశ్వరరావు, మోహనరావు, వై.ఎస్.నాయుడు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నియామక పత్రాలను ఎన్నికల నిర్వాహకులు యువశ్రీ, కమరున్నీసా బేగం, బాపిరాజు, శర్మ, లెనిన్‌లు అందజేశారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సత్కారం



ముఞ్నాజీ మాస్టారును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని సోమవారం 87 వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఎం.మున్నాజీ మాస్టారు పదవీ విరమణ చేయడంతో ఆయన్ను వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డగోవింద్ సత్కరించారు. చిత్రాడ వెంకటరమణ, సంతోష్ తదితరులు ఆయన సేవలను కొనియాడారు. మరో కార్యక్రమంలో నాయకులు ఎం. దామోదర్,దానప్పలు,పి. వేణుబాబు,బొండా గోవింద్‌రాజులు మున్నాజీ మాస్టారును ఘనంగా సత్కరించారు.

అన్న ప్రసాదానికి విరాళాలు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ప్రతీ శనివారం భక్తులకు నిర్వహించే అన్న ప్రసాదాలకు భక్తుల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం శీలానగర్ జగ్గయ్యపాలెంకు చెందిన సీరం కృష్ణవేణి, ఎం.శ్రీనివాసరావు, నాగమణిలు రూ.10 వేలు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. అలాగే అక్కిరెడ్డిపాలేనికి చెందిన శివరామకృష్ణ, ధనలక్ష్మి దంపతులు రూ.5116 అందజేశారు.

బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి దరి బొర్రమాంబ ఆలయ సమీపంలో ఆర్ఆర్ స్పోర్ట్స్ అండ్ ఫిట్నెస్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఇండోర్ బాల్‌బ్యాడ్మింటన్ కోర్ట్, జిమ్‌లను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్వరరావు, నిర్వాహకులు సర్వసిద్ధి భాను సతీష్, గౌతమ్ చంద్, విల్లా రామ్మోహన్ కుమార్, కార్పొరేటర్ మొల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

27న ఉక్కునగరంలో మేడే మార్చ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఈ నెల 27న మే డే మార్చ్ నిర్వహించనున్నామని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకై నిర్వహించనున్న మార్చ్ ఆ రోజు ఉదయం 6.30 గంటలకు సెక్టార్-5 త్రిష్నా మైదానం నుంచి ప్రారంభమవుతుందన్నారు. 5 కిలో మీటర్లు నిర్వహించనున్న మార్చ్‌లో ఉక్కు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, ప్రజలంతా పాల్గొవాలని ఆయన కోరారు.

చందనోత్సవంలో బాలలకు సౌకర్యాలు కల్పించాలి

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి వచ్చే బాలలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. చిన్నారులకు వారి తల్లులు పాలు పట్టేందుకు వీలుగా క్యూల్లో తగినన్ని ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. బాలలకు మంచి నీరు, వేడి పాలు, అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కొత్త రేషన్ కార్డులు ఎప్పుడో..!



- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న అర్హులు
- పేదల గోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారికి షాక్ ఇస్తోంది. అధికారంలోకి వచ్చి పదినెలలు గడిచినా ఇప్పటి వరకూ ఒక కొత్త రేషన్ కార్డు మంజూరు చేయలేదు. ప్రతి పథకానికి రేషన్ కార్డు అవసరం కావడంతో పేద ప్రజలు సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా దరఖాస్తులు స్వీకరించేది లేదని సచివాలయా సిబ్బంది చెడుతుండటంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. అలాగే రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటికే రేషన్ కార్డులు : 2019- 2024 వరకూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా అర్హులైన వారందరికీ ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తు చేయించి.. వారి ఇంటికే రేషన్ కార్డులు తెచ్చి అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు చాలా హామీలు ఇచ్చినా.. ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజల శ్రేయస్సును విస్మరిస్తోంది. అధికారంలోకి వచ్చి పదినెలలు గడుస్తున్నా కొత్త రేషన్ కార్డుల మాటే ఎత్తడం లేదు..సరికదా ఈకేవైసీ పేరుతో ఉన్న వాటిని తొలగించే ప్రయత్నం చేస్తోంది. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై తీవ్ర నిరాశ చెందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి అర్హుల వద్ద దరఖాస్తులు స్వీకరించి పథకాలు, రేషన్ కార్డులు వంటివి అందించేవారు.

వారికి నిరాశే

గతంలో కొత్తగా వివాహం అయిన వారు తల్లిదండ్రుల కార్డుల నుంచి తమ పేర్లు తొలగించాలని దరఖాస్తు చేసుకుంటే స్విట్ ఆప్షన్ ద్వారా సచివాలయ సిబ్బంది వెంటనే వారి పేర్లు తొలగించే వారు . అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ కార్డు వెబ్ సైట్ పనిచేయకపోవడంతో కొత్త జంటలు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే పరిస్థితి లేదు. దీంతో అర్హులైన పేదలు కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు ఇస్తారో అని ఎదురు చుస్తున్నారు.

మళ్లీ 2014 మాదిరిగానే ఇస్తారా..

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం అరకొరగా రేషన్‌కార్డులు మంజూరు చేసింది. అప్పట్లో జన్మభూమి కమిటీలు, స్థానిక టీడీపీ నాయకుల పెత్తనంతో కార్డులు మంజూరయ్యేవి. దీంతో అర్హులకు కార్డులు దక్కలేదు. ఈ కారణంగా తెల్ల రేషన్ కార్డులు రాని వారు నిరాశకు గురయ్యేవారు. దీంతో చాలా వరకు పేద ప్రజలు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. కనీసం నిత్యావసర సరకులు అందక ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఇప్పుడు తెల్ల రేషన్ కార్డుల మంజూరు విషయంలో కూటమి నేతలు జోక్యం చేసుకుంటే రేషన్ కార్డులు మంజూరులో కోతలు పడే అవకాశాలున్నాయని పేద ప్రజలు పెదవి విరుస్తున్నారు.

యాడింగ్ కోసం నిరీక్షణ



నాకు వివాహం అయిన తర్వాత రేషన్ కార్డు ఇచ్చారు. అయితే పిల్లలను రేషన్ కార్డులో యాడింగ్ చేయడానికి సచివాలయం చుట్టూ పలుమార్లు తిరిగినా వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరుతో పాటు సభ్యులను చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలి..

– ఎస్ రాజ్‌కుమార్, పెదగంట్యాడ

రేషన్ కార్డులు ఇవ్వాలి



మండలంలో అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి. అలాగే రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకునే విధంగా వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. పేద ప్రజలకు ప్రభుత్వ సేవలు, పథకాలు పొందేందుకు తెల్ల రేషన్‌కార్డు అవసరం ఉంది. పేదలు పనులు మానుకుని సచివాలయాల చూట్టూ ప్రదక్షిణచేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలి.

– గొందేశి సుమన్‌రెడ్డి, నెల్లిముక్కు

ఉత్తర్వులు రావాల్సి ఉంది



కొత్త రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది.. ఉత్తర్వులు వచ్చిన వెంటనే ప్రజలకు తెలియజేస్తాం. అర్హులకు కార్డులు అందిస్తాం.. వెబ్‌సైట్ ఓపెన్ కాగానే రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

– తవ్వా కృష్ణ, ఏఎస్‌వో, గాజువాక సర్కిల్-3

ఘనంగా పెంటమాంబ మారువారం



పెంటమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కు గ్రామ దేవత పెంటమాంబ అమ్మవారి మారువారం పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు చేశారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పుసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి రమణారెడ్డి, గొందేశి అప్పల రెడ్డి, పిట్ట కుంచారావు, గొందేశి సుమన్ రెడ్డి, శ్రీరామూర్తి, గొందేశి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపేలా చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాలు, ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 78 వార్డు కార్పొరేటర్ బి. గంగారావు నేతృత్వంలో నాయకులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యాజమాన్యం ఇప్పటికే సుమారు 1500 మంది పైగా కార్మికులను తొలగించిందని వివరించారు. ఇకపై తొలగింపులు జరగకుండా, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు పి.వి. నగేష్, వంశీకృష్ణ, భాస్కరరావు, బైరెడ్డి, అప్పారావు, నాగిరెడ్డి, అఖిలపక్ష నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, ఉమ్మిడి అపారావు, డి. రమణ, జానీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ బైపీసీ చేసిన వారికి ఉపాధి శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు బీఎస్సీ పారామెడికల్, నర్సింగ్, బీపీటీ, ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామని బొల్లినేని మెడ్స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. 2024లో ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగ అవకాశం కల్పించి, ఫీజు జీతం నుంచి మినహాఇస్తామన్నారు. కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు పదోతరగతి, ఇంటర్, టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 21న సాయంత్రం 3 గంటలులోగా రాగోలు లోని జేమ్స్ ప్రాంగణంలోని కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు 7995013422, 7680945357 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

సంజీవరెడ్డి దృష్టికి స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు



ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి సమస్యలు వివరిస్తున్న రామచంద్రరావు

ఉక్కునగరం: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో స్టీల్ ఐఎన్‌టీయూసీ చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు కలిసి స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలను వివరించారు. కార్మిక టౌన్‌షిప్ క్వార్టర్స్ నివసిస్తున్న వారికి విద్యుత్ చార్జీలు యూనిట్ ధర రూ.50 పైసలు నుంచి రూ.8కి పెంచేశారని.. కంపెనీ ఉత్పత్తి మెరుగుపడినా రాయితీ పునరుద్ధరించలేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 2 వేల మందిని అక్రమంగా తీసేశారని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ఉక్కుమంత్రితో మాట్లాడి అక్రమ తొలగింపులు ఆపేలా సహకరించాలని కోరారు.

వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన కార్యక్రమాలు




పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు అన్నారు. ఈ చట్టంపై అవగాహన కల్పించడానికి ముద్రించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ భూముల ప్రయోజనాలను పేద ముస్లింలకు అందించాలనే ఉద్దేశంతో చట్టంలో సవరణ చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు పొలిమేర శ్రీనివాస్, దీనంకొండ కృష్ణంరాజు, బొత్స దిలీప్, నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న చెవి రింగు అందజేత



చెవిరింగు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు



చెవిరింగు

ఉక్కునగరం: బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న చెవి రింగును ఆర్టీసీ సిబ్బంది అందజేసి తమ నిజాయతీ చాటుకున్నారు. కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపోకు చెందిన 111 వీ బస్సులో ఆదివారం శ్రీకాకుళానికి చెందిన గరికపాటి రాము ఆనందపురం దగ్గర ఎక్కారు. మద్దిలపాలెంలో దిగిన అతను రిపేర్ కోసం తెచ్చిన తన భార్య చెవి రింగును పోగొట్టుకున్నాడు. అతను వెంటనే ద్వారకా బస్ స్టేషన్‌లో స్పెషల్ డ్యూటీలో ఉన్న స్టీల్ సిటీ డిపో అసిస్టెంట్ డిపో మేనేజర్ శ్రీనివాసరావును సంప్రదించారు. అప్పటికే సర్వీసు పూర్తి అయి బస్ డిపోకు చేరి సిబ్బంది ఇంటికి వెళ్లిపోయారు. అసిస్టెంట్ మేనేజర్ ఆదేశాల మేరకు కంట్రోలర్ గోపిశెట్టి అప్పారావు, ఆర్టీసీ కానిస్టేబుల్ శంకరావు బస్‌లో వెతికారు. బస్‌లో దొరికిన 4 గ్రాముల బరువైన చెవి రింగును ఆధారాలు పరిశీలించి ఆ ప్రయాణికుడికి అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, ద్వారకా బస్ స్టాండ్ స్టేషన్ మేనేజర్లు ఎం.వి.రావు, పి.వి. రావు ఉన్నారు.

వందే భారత్, నాగావళికి దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలి

అగనంపూడి: సంబల్‌పూర్ – నాందేడ్ మధ్య నడుస్తున్న నాగావళి ఎక్స్‌ప్రెస్, విశాఖ సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లకు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని కోరుతూ తూర్పు కోస్తా రైల్వేజోనల్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ విశాఖ డీఆర్ఎం లలిత్‌బోరాను కోరారు. ఎన్టీపీసీ, ఎస్ఈజెడ్, ఫార్మాసిటీ, స్టీల్‌ప్లాంట్, హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి, విజ్ఞాన్ యూనివర్సిటీలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు, పరవాడ, గాజువాక, సబ్బవరం మండలాల ప్రజలకు దువ్వాడ రైల్వే స్టేషన్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతీయులు విశాఖలో రైలు దిగి తిరిగి వెనక్కిరావడానికి కనీసం రెండు గంటల సమయం పడుతుందని, దీంతో సమయం వృథా అవుతుందన్నారు. వీటిని పరిగణలోకి తీసుకొని దువ్వాడ రైల్వేస్టేషన్‌లో నాగావళి, వందేభారత్‌లకు హాల్ట్ ఇవ్వాలని ఆయన కోరారు.

ఉచిత మజ్జిగ పంపిణీకి అనుమతి ఇవ్వండి

సుదూర ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్తున్న జనరల్ బోగీ ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసేందుకు అనుమతినివ్వాలని డీఆర్ఎంను ఈశ్వర్ వినతిపత్రంలో కోరారు. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్, స్పందన చేయూత ఫౌండేషన్ మన వికాస వేదిక, మానవతా ట్రస్ట్, సత్యసాయి సేవా సమితి వంటి 13 స్వచ్ఛంద సంస్థలు ఉచిత మజ్జిగ పంపిణీకి ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. వారు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో మజ్జిగ పంపిణీకి అనుమతినివ్వాలని ఆయన కోరారు.

గంధం అమావాస్యకు ఏర్పాట్లు

సింహాచలం: ఈ నెల 27న గంధం అమావాస్య సందర్భంగా వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో కె.సుబ్బారావు సోమవారం మీడియాకు తెలిపారు. 28 నుంచి వచ్చేనెల 2 వరకు ఆలయంలో భగవత్ రామానుజాచార్యుల తిరునక్షత్ర పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ రోజుల్లో రాత్రి 7 గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయన్నారు. ఆర్జిత సేవలన్నీ నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. 29న మూర్తి కళావాహనం సందర్భంగా ఆ రోజు సాయంత్రం 6 వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయన్నారు.

మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ పనులు సత్వరం పూర్తి చేయాలి



అధికారులకు సూచనలు చేస్తున్న వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖ సిటీ: మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, వాణిజ్య సముదాయ భవనం, హెలీకాప్టర్ మ్యూజియానికి సంబంధించిన అన్ని పనులను ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ అధికారులను ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వాటిని ప్రారంభించనున్న నేపథ్యంలో సోమవారం ఈ రెండు ప్రాజెక్టులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిన పనులు ఏమైనా మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. ఈ పర్యటనలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్ఈలు భవానీశంకర్, బలరామరాజు, ఈఈలు మధుసూధన్, రామరాజు, దుర్గాప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదు పరిష్కరించే విధంగా చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్

గాజువాక: ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఆయన గాజువాక జోనల్ కార్యాలయంలో ప్రజల నుంచి సోమవారం వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో గాజువాకలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, కార్పొరేటర్లు లేళ్ల కోటేశ్వరరావు, బొండా జగన్, దల్లి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం గాజువాక జోనల్ కార్యాలయంలో పోషణ్ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోషకాహారం అందించడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ నీలవేణి, ఎంఈవోలు రమణాజీ, సునీత, పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.నాగ అప్పారావు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం హజ్ యాత్రికుల కోసం అవగాహన, వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ, విజయనగరం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన 66 మంది యాత్రికులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు టీకాలు వేశారు. డాక్టర్ బి. లూసి కొర్ణీలియా (డీఐవో, విశాఖపట్నం), డాక్టర్ కె. ఎస్. రోష్ని (అసిస్టెంట్ ప్రొఫెసర్, కేజీహెచ్), డాక్టర్ ఎ. ఉషా (పిల్లల వైద్యులు), డాక్టర్ బి. ఎం. ప్రవీణ్య (స్త్రీల వైద్యులు), డాక్టర్ ఎస్. శ్రీనివాస్ (జనరల్ డాక్టర్), హజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి

మల్కాపురం: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని పేదలకు తక్షణమే ఇళ్లపట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఇంటి పట్టాల సమస్యపై సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ములగాడ హౌసింగ్‌కాలనీ సమీపంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జగ్గునాయుడు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలు జీవో నెంబర్ 30 ప్రకారం ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసి ఏడాది కావస్తున్నా ఇంత వరకూ కనీసం విచారణ చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే దరఖాస్తులు పరిశీలించి అర్హులందరికీ పట్టాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉచిత గ్యాస్ అందరికీ ఇవ్వడం లేదు సరికదా.. ఇప్పుడు రూ.50 పెంచి అదనపు భారం మోపారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆందోళన కారుల వద్దకు తహసీల్దార్ భుజంగ రావు వచ్చి డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

రండి రండి.. దయ చేయండి

- గాజువాక హైస్కూల్‌లో నూతన విద్యార్థులకు వినూత్న స్వాగతం
- తొలిరోజు 119 మంది చేరిక



నూతన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న ఎంఈవో సునీత



నూతన విద్యార్థులకు పూలు అందజేసి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

గాజువాక: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు వినూత్నంగా స్వాగతం పలికారు. ఎంఈవో సునీత, పాఠశాల ఇన్‌చార్జి జనార్దనరావు ఆధ్వర్యంలో మామిడి తోరణాలు కట్టి, విద్యార్థులకు పూలు, స్వీట్లు అందజేసి తరగతులకు స్వాగతం పలికారు. నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులందర్నీ పలకరించి మధ్యాహ్న భోజనం అందజేశారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కేంద్రాలను, హైస్కూల్ ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలలను ఇటీవల సందర్శించి అక్కడి విద్యార్థులను తమ పాఠశాలల్లో చేరే విధంగా ప్రోత్సహించారు. అందులో భాగంగా సోమవారం కొత్త గాజువాక, భానోజీ కాలనీ, శ్రామికనగర్, సింహగిరి కాలనీ, చినగంట్యాడ, శ్రీనగర్, ఇందిరా కాలనీ, డ్రైవర్స్ కాలనీ, సుందరయ్య కాలనీ ప్రాథమిక పాఠశాలల నుంచి 119 మంది విద్యార్థులు గాజువాక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో అడ్మిషన్లు పొందినట్టు ఇన్‌చార్జి జనార్దనరావు ఈ సందర్భంగా తెలిపారు. ఈ డ్రైవ్‌ను ఈనెల 23వ తేదీ వరకు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

